# వధువ్యాపారి



పోవే... ఎక్కడికిపోతావో... పో! జానకమ్మ భుజాలు పట్టుకుని తలుపుదాకా లాక్కొచ్చాడు వెంకట్రామయ్య. ఆరేళ్ళ కొడుకు చంద్రం తల్లి కొంగుపట్టుకుని ఏడుస్తున్నాడు.

"నువ్వెక్కడికిరా వెధవా! లోపలికి పద–" అంటూ మనవడిని లోపలికి లాగింది నరసమ్మ.

"అత్తయ్యా! మీ కాళ్ళు పట్టుకుంటాను – నన్ను వెళ్ళిపొమ్మంటే ఇప్పుడెక్కడికిపోతాను?" గొల్లున ఏడుస్తూ బతిమాలుకుంది జానకమ్మ.

"చెప్పినట్లు పడిఉంటే ఉండు. ఆడది పుస్తకాలు చదవటం మా ఇంటా వంటా లేదు. మహా ఆరో క్లాసు చదివాను గదా అని నీలుగుతున్నట్టున్నావు. ఆ పక్కింటి నాంచారమ్మతో మాట్లాడకు అంటే వినవు. అదసలే సంసారిలా ఉండదు. ఊళ్ళో ఆడాళ్ళనందర్నీ చెడగొడుతోంది. మధ్యాహ్నం పూట వెళ్ళడం, దాని ఉపన్యాసాలు వినడం, అది చాలక దాని దగ్గర్నించి పుస్తకాలు తెచ్చుకుని చదవడం. ఏదో ఇంటి పని చేసుకోవాలి గానీ... ఇట్లా తైతక్కలాడితే మా అత్త మామలూ మొగుడూ నన్ను ఇంట్లో ఉండనిచ్చేవారా? భయభక్తులతో అణిగిమణిగి పడి ఉంటేనే ఆడదానికి అత్తిల్లు–" నరసమ్మ వాగ్బాటి చుట్టు పక్కల ఇళ్ళల్లోని కోడళ్ళకి కూడా వినబడింది. వాళ్ళు మటుకు ఏంచేయగలరు – బాధపడటంతప్ప?

మర్నాడు పనయ్యాక నాంచారమ్మ చుట్టు పక్కల ఆడవాళ్ళని పిలిచి వీరేశలింగం గారి రాజశేఖర చరిత్ర విన్పించింది – స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేకనే పురుషుల ఆటలు చెల్లుతున్నాయంది – జానకమ్మ వృత్తాంతం అప్పటికే ఆవిడ చెవినబడింది.

నాంచారమ్మ తండ్రి బ్రహ్మ సమాజంలో చేరడం వల్ల కూతురికి ఎస్సెల్సీ దాకా చదువు చెప్పించాడు. తన అభ్యుదయ భావాలు కూతురికీ నేర్పించాడు. నాంచారమ్మని తన సమాజం వాడికే యిచ్చి పెళ్ళిచేశాడు. అందుకని ఆ దంపతుల మధ్య విభేదాలు లేవు. ఒకరికొకరు సర్దుకుపోయే గుణం వాళ్ళది.

అక్కచ్చమ్మ ముచ్చట్లతో వృథాగా కాలం వెళ్ళబుచ్చుతున్న ఆ వీధి స్త్రీలను పిలిచి మధ్యాహ్నం వేళ కాస్త చదువు చెప్పడం, పుస్తకాల్లో కథలు చెప్పడం, కుట్లూ అల్లికలూ నేర్పించడం చేస్తుండేది నాంచారమ్మ. వాళ్ళకి ఒక కూతురు. పట్నంలో హాస్టల్లో పెట్టి చదివిస్తున్నారు.

నాంచారమ్మ దగ్గరికి ఎక్కువగా యువతులే వచ్చేవాళ్ళు. అత్తగార్లకి నాంచారమ్మ మీద కోపంగా ఉండేది. తమ కోడళ్ళు కుక్కిన పేనుల్లా పడి ఉండటం లేదని, ఇదంతా నాంచారమ్మ ప్రభావమేనని. పైగా వయసొచ్చిన కూతురికి పెళ్ళి మాట తలపెట్టకుండా పట్నంలో ఉంచి చదివిస్తున్నదని.

జానకమ్మకి ఇరవయ్యేళ్ళుంటాయి. పనంతా అయ్యాక నాంచారమ్మ దగ్గర సత్కాలక్షేపానికి వెళ్ళాలని ఉవ్విళ్ళూరేది. కానీ అత్తగారు ఒప్పుకోదని ఒక్కోసారి దొంగచాటుగా వెళ్ళేది. తెలిసినప్పుడు అత్తగారు భర్తతో చెప్పి కొట్టించేది.

పుస్తకాలు చదివితే తప్పేమిటో జానకమ్మకి తెలిసేది కాదు. కానీ అవే ధైర్యాన్నిస్తాయని, తిరుగుబాటు నేర్పిస్తాయని, కొందరు పుణ్యపురుషులు స్త్రీల మేలుకోసం చాలా శ్రమ పడుతున్నారని తెలుపుతాయనీ ఊహించలేదు.

ఒకసారి ఇలాగే "ఇంట్లోనుంచీ పో ముందు" అని వెంకట్రామయ్య బయటికి లాక్కొచ్చాడు జానకమ్మని.

జానకమ్మ ఎప్పటిలా ఏడవకుండా ఎది

## సత్యవాడ (ఓగేటి) ఇందిరాదేవి

రించి మాట్లాడింది. కట్టుకున్నవాడు పోషించి తీరాల్సిందేనని, వెళ్ళగొట్టటానికి అతనికి హక్కులేదని, పెళ్ళి మంత్రాల్లో కూడా భార్యని జీవితాంతమూ పోషించాలని ఉందని, మను స్మృతిలో భార్యని కష్టపెట్టేవాడు చెడ్డవాడు అని ఉందనీ ధైర్యంగా చెప్పింది.

"అమ్మో... అమ్మో... దీనికీ తెలివంతా ఆ నాంచారమ్మ ఉపదేశం వల్లనే వచ్చింది నాయ నోయ్ - ఇట్లా మాట్లాడేది సంసారం ఎట్లా చేస్తుంది దేవుడోయ్ అని లబలబలాడి ఒరే అబ్బాయ్... దీన్ని ఇంట్లోకి రానీకురా అని ఆర్డరేసింది నరసమ్మ.

"నువ్వుపోతే పెళ్ళాం ఎట్లా వస్తుంది? అని అడిగావుకదా. నెలలో ఇంకోతి వస్తుంది. నోరెత్తని పిల్లని చేసుకుని చూపిస్తా నా తడాఖా - ఏం? దేశం ఆడపిల్లలకి గొడ్డుపోయిందా?" అని భార్యని బయటికి తోసి తలుపుకి గొళ్ళెం పెట్టాడు వెంకట్రామయ్య.

జానకమ్మ కన్నీళ్ళు తుడుచుకుంటూ నాంచారమ్మ ఇంటికెళ్ళింది.

"అంతా విన్నాను జానకీ! మరేం భయం లేదులే" అని ఆదరించింది నాంచారమ్మ.

"మా అమ్మ, నాన్న ఒకపూట గడిస్తే ఒక పూట గడవకుండా కాలం గడుపుతున్నారు - పుట్టింటికెళ్ళి వాళ్ళకి భారం కాలేను. ఇక్కడ నా కొడుకునేమో వీళ్ళు ఉంచేసుకున్నారు" అని బాధపడింది జానకమ్మ.

"నీ కొడుకుని తరచుగా నీ దగ్గరికి పంపే ఏర్పాటు నేను చేస్తాను ఏదో మిషతో. డబ్బు ఇబ్బంది కదా ఇప్పుడు నీకు. ముందు నిన్ను నువ్వు పోషించుకుంటూ మెట్రిక్ పరీక్షకి కట్టు. పద నిన్ను మా అమ్మాయికి అప్పగించివస్తా" అని ధైర్యం చెప్పి పట్నం తీసుకెళ్ళింది నాంచారమ్మ.


నెలలో కాకపోయినా ఆర్నెల్లలో రాజ్యం అనే పిల్లని మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు వెంకట్రామయ్య. జానకి అంత అందంగా ఉండదు రాజ్యం. పైగా అత్తగారి మీదే ఇంటి పనంతా వదిలేసి అమ్మలక్కలతో కబుర్లు చెప్తూ ఉండేది. నగలు చేయించమని, చీరలు కొనమనీ చంపుకు తినేది భర్తని. పుట్టింట్లోని గర్భదరిద్రం అంతా వదిలిపోవాలన్నట్లు చంద్రాన్ని సరిగా చూసేదికాదు.

నాంచారమ్మ కూతురికి, ఆమె స్నేహితులు ఇంకో నలుగురికీ వండిపెడుతూ, సాయంత్రాలు వాళ్ళ దగ్గిర చదువుకుంటూ పరీక్షలు పాసవసాగింది జానకమ్మ. చంద్రాన్ని అప్పుడప్పుడూ తల్లి దగ్గరకి తీసుకొచ్చేది నాంచారమ్మ. అప్పటికి జానకమ్మ జానకి అయి, ఒక స్కూల్లో టీచరుగా చేరింది. నాంచారమ్మ కూతురికి పెళ్ళయింది.

వెంకట్రామయ్యకి ఎనిమది మంది పిల్లలు. అందరిలోకీ చంద్రమే బుద్ధిగా ఉంటూ బాగా చదువుకుని మంచి ఉద్యోగంలో చేరాడు.

తల్లి రూపమూ, బుద్ధీ వచ్చాయి. పాపం జానకమ్మ ఎక్కడుందో అనుకునే వారు ఊళ్ళోని వారు.

నరసమ్మ, నాంచారమ్మ బాగా పెద్దవాళ్ళయిపోయారు. తనకి వచ్చే స్వల్ప సంపాదనతో ఇంట్లో డజనుమంది దాకా పోషించలేక క్రుంగిపోయాడు వెంకట్రామయ్య. రెండవ భార్య రాజ్యం గొంతెమ్మ కోర్కెలు తీర్చడానికి చాలా అప్పులు చేశాడు. చంద్రానికి మంచి జీతం వస్తుంది... ఇక ఆ అప్పులన్నీ తీర్చవచ్చు, పెళ్ళికెదిగిన కూతుళ్ళకి పెళ్ళిళ్ళూ చేయవచ్చు... అని నరసమ్మ వెంకట్రామయ్యకి నూరిపోయడం ప్రారంభించింది.




చంద్రానికి పెళ్ళి సంబంధాలు వస్తే తిరగ కొట్టడం మొదలుపెట్టింది.

అధవావాళ్ళు మరీ పట్టుబడితే చాలా ఎక్కువ కట్నాలు, లాంఛనాలు అడిగి వాళ్ళంతట వాళ్ళే విరమించుకునేటట్లు చేసేది ముసలావిడ.

ఒకరోజు పంజాబీ డ్రెస్ వేసుకున్న అమ్మాయిని తీసుకొచ్చి "నా భార్య – ఇవాళే రిజిష్టర్ మారేజి చేసుకున్నాం" అని చెప్పాడు చంద్రం కూల్‌గా.

నిలువు గుడ్లేసుకుని చూసింది నరసమ్మ. నిర్ఘాంతపోయాడు వెంకట్రామయ్య. నోట్లో మట్టిగడ్డ కొట్టినట్లు తన కూతుళ్ళకింకేం పెళ్ళవుతుంది? అని ఉక్కిరిబిక్కిరైంది రాజ్యం.

"ఎంత పని చేశావురా – ఎక్కువ కట్నం తీసుకుందాం అనుకున్నాను – కట్టుబట్టలతో ఇంటికి తెచ్చావా కట్టుకున్న భార్యని? అసలు మన కులమేనా?" అని మొత్తుకుంది నరసమ్మ.

ఎవరేమన్నా కేర్ చేయలేదు చంద్రం.

"నాయనమ్మా! మా ఆవిడ సునీతకి ఇంటి పని, వంటపనీ చేతకాదు. తను ఉద్యోగం చేస్తుంది పట్నం వెళ్ళి. పెందలాడే వంట చేసి పెట్టెయ్యి" అని చెల్లెళ్ళని పిల్చి "మీ వదిన టిఫిన్ బాక్స్ సర్ది పెట్టండి" అని చెప్పాడు.

ఒరేయ్ చంద్రం! మీ అమ్మనే వెళ్ళగొట్టిన దాన్ని నీ పెళ్ళాన్ని వెళ్ళగొట్టలేనా? చూస్తుండు" అని నరసమ్మ మనసులో ప్రతిజ్ఞ చేసుకుంది.

ఆఫీసునించి వచ్చి ఒక్క పనీ ముట్టుకోదు సునీత. దగ్గర్లో ఉన్న పట్నం వెళ్ళి అలిసిపోయానని పుస్తకం చేత్తో పట్టుక్కూచుంటుంది. లేకపోతే నాంచారమ్మ గారింటికెళ్ళి కూచుంటుంది. నాంచారమ్మ ఈమధ్య సాయంత్రం స్కూలు పెట్టింది.

ఛీ – ఈ నాంచారమ్మ పాడుగానూ – ఆడవాళ్ళని పాడు చేయడమే దీనిక్కావాలి" అని తిట్టుకునేది నరసమ్మ.

రోజూ మెల్లిమెల్లిగా సునీత మీద చాడీలు చెప్పిచెప్పి ఎట్లాగో చంద్రం మనసు విరిచే సింది.

"నీ ప్రవర్తన నాకు నచ్చలేదు సునీతా! ఇంట్లో నుంచి వెళ్ళిపో" అన్నాడు చంద్రం ఎట్టకేలకి.

"నాకూ నీ ప్రవర్తన నచ్చలేదు. నేనే వెళ్ళిపోదామనుకుంటున్నా - కానీ రేపు నీ గతేమిటి? పాపం పెళ్ళాం లేని జీవితమైపో తుంది. ఆనక చెప్పలేదనేవు" అన్నది సునీత కూడా మొండిగా.

"ఎంత పొగరే నీకు? వాడికి పెళ్ళాం ఉండ దా?" అంటూ చిటికెలు వేసి రేపీపాటికి... వింటున్నావా? రేపీపాటికి బంగారు బొమ్మ లాంటి పిల్లని తెచ్చి పెళ్ళి చేయనూ? దొరబాబు లాంటి నా మనవడికి" అంది నరసమ్మ.

పకపక నవ్వింది సునీత - "అలాగే జైల్లో కాపరం పెట్టిద్దురు గాని" అంటూ భర్తవేపు తిరిగి "చంద్రం! మీ నాయనమ్మకి చెప్పు. కాలం మారిందని. నేను విడాకులిస్తేగానీ నీ పెళ్ళికి ఛాన్సులేదని" వెళ్ళిపోయింది సునీత పుట్టింటికి. ఆమె తల్లి కస్తూరి, తండ్రి డాక్టర్ రావూ, తమ్ముడు రాహుల్ ఆమెని ఆదరించి అక్కున జేర్చుకున్నారు ముసిముసిగా నవ్వుకుం టూ.

మర్నాడు కాదు... నెల గడిచినా చంద్రానికి రెండో సంబంధం కుదరలేదు. సరికదా... విడాకులివ్వకుండా రెండో పెళ్ళికి ఎవరు ఒప్పుకుంటారు? అని ఈసడించి పారేశారు.

"ఆ విడాకులేమిట్రా - ప్రతివాళ్ళూ అదేమాట. ఆ ఆకులేవో నువ్వే యిచ్చెయ్. చిటి కెలో పెళ్ళి చేస్తాను కట్న కానుకలతో. ఒరేయ్ వెంకట్రాముడూ! నువ్వే ఏదైనా సంబంధం చూడవేం?" అని హడావుడి మొదలెట్టింది ముసలమ్మ.

"మన చేతిలో ఉందనుకుంటున్నావా అమ్మా ఇదంతా? ఆ పిల్ల స్వయంగా విడాకు లడిగితే తొందరగా యిస్తారు. అదీ కనీసం రెండేళ్ళు పడుతుంది. గవర్మెంటు రూలు. అపుడు నీ మాట విని జానకిని వెళ్ళగొట్టి. నట్లనుకున్నావా? పైగా ఆ అమ్మాయేమో విడాకులు ఇవ్వనని భీష్మించుక్కూచుంది అంటూ పై పంచె దులుపుకుని బయటికెళ్ళి పోయేవాడు వెంకట్రామయ్య.

"అంత ఇష్టమైతే ఆ జానకినే తెచ్చుకో రాదూ?" అంటూ అలకపాన్పెక్కి ముక్కు చీ దుతూ పడుకునేది రాజ్యం. ఇల్లు నరకంలా మారసాగింది.

చుట్టాలిళ్ళలో కాస్త అనాకారిగా ఉన్న పిల్లల్ని సైతం చూసి, వాళ్ళ పెద్దవాళ్ళనడిగింది నరసమ్మ". లాభంలేదు... విడాకులొచ్చినా రెండోపెళ్ళివాడిని ఇప్పుడు ఏ ఆడపిల్లా పెళ్ళి చేసుకోదు. రెండోపెళ్ళి అమ్మాయి ఉంటే లోపాయికారీగా కొంత డబ్బు ముట్టజెప్తే ఒప్పుకుంటుందేమో! విడాకులు రాకపోయినా "ఒకే యింట్లో స్నేహితులుగా ఉంటున్నాం కానీ మాకే సంబంధం లేదు" అని ఆ పిల్ల చెప్తే ఫరవాలేదు.

ఇప్పుడు ఆడపిల్లలు తెలివి మీరిపోయారు. అందరికీ ఇబ్బడిముబ్బడిగా చదువులు, పాతి కేసి వేలకి తక్కువ కాకుండా జీతాలు. గవర్మెం టు రూల్స్ మార్చేసింది ఆడవాళ్ళ కోసం. ఫోర్‌నైన్‌టీఎయిట్‌బైఏ అనే సెక్షన్ వచ్చింది. అత్తగారింట్లో సరిగ్గా చూడకపోతే, బాధపెడితే కోడలికి కేసుపెట్టే హక్కుంటుంది. శుభ్రంగా అత్తారని చూడకుండా వెంటనే జైల్లో పెట్టేస్తారు పోలీసులు. ఎక్కడైనా రెండోపెళ్ళి పిల్లో, ఒక

పిల్ల ఉండి భర్త చనిపోయిన అమ్మాయో లేక విడాకులు తీసుకున్నా అమ్మాయో కష్టమ్మీద దొరకొచ్చు కొన్నేళ్ళు ప్రయత్నించాలి. ఈ లోపల విడాకులకి కేసు పడెయ్యాలి" అని అందరూ రకరకాలుగా చెప్పారు.

"వీళ్ళ రూల్స్ పాడుగానూ - ఆడదానికెంత అధికారం వచ్చిందిరా దేవుడా! ఈ చదువులొచ్చి కొంపముంచుతాయని నేను నెత్తిన నోరు పెట్టుకుని మొత్తుకుంటూనే ఉన్నాను కానీ కలికాలం వచ్చిపడిందిస్మీ - మొగాడికి రెండోపెళ్ళి అయితే ఏం? మొదటి పెళ్ళి పిల్లే దొరకదా? అవ్వ... ఇదేం పొయ్యేకాలం?" అని తిట్టుకుంది నరసమ్మ.

నాంచారమ్మ కూతురు కస్తూరి, అల్లుడు డాక్టర్ రావు. జానకి వాళ్ళపక్కింట్లోనే ఉంటోంది. వారానికొకసారి వచ్చి తనపెళ్ళి సంబంధాల ముచ్చట్లు, నాయనమ్మ ఆరాటం చెప్పి నవ్విస్తూండేవాడు చంద్రం. కస్తూరి కూతురు సునీత. తల్లిపడిన బాధ నాయనమ్మకి, తండ్రికీ తెలియాలి అని చంద్రం తపన. నాంచారమ్మ భర్త కూడా రిటైరవడంతో కూతురి దగ్గరకే వచ్చేశారు.

ఈ మధ్య వెంకట్రామయ్య మనసులో జానకే మెదులుతున్నది. తల్లి చెప్తే మటుకు ఏ తప్పూ చేయని భార్యని ఇంట్లోనించి వెళ్ళగొట్టాడు తను నిర్ధాక్షిణ్యంగా. మగవాడినని గర్వపడ్డాడు. స్త్రీల చదువుని తల్లిగాని, తనుగానీ ఆపగలిగారా? చింకిచేటని అడ్డం పెట్టి సూర్యకాంతిని ఆపగలరా? ఇప్పుడు స్త్రీలు కసితో చదువుకుంటున్నారు. పురుషుడితో పాటే కాదు కొన్నిచోట్ల అంతకంటే ఎక్కువే. స్త్రీలని వేధించకుండా ఎన్నో చట్టాలు చేసింది ప్రభుత్వం. అమాయకురాలైన ఇల్లాల్ని ఇంక నిష్కారణంగా ఇంట్లోనుంచీ వెళ్ళగొట్టగలరా? ఊహూ ఇంకానా దౌష్ట్యం? ఇకపై చెల్లదు. జానకీ! నన్ను క్షమించగలవా? అనుకున్నాడు వేదనగా.

చంద్రం తన భార్య ఉన్న ఊరికి ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడు. సునీత కస్తూరి కూతురనిగాని, జానకి కూడా వాళ్ళ పక్కింట్లోనే ఉందనిగానీ నరసమ్మకి, వెంకట్రామయ్యకీ తెలియకుండా జాగ్రత్తపడ్డారు.

తండ్రి చేతికి యాభైవేల రూపాయలిచ్చి ఇంక తను డబ్బు సాయం చేయలేనన్నాడు చంద్రం ఖచ్చితంగా. నాకీ శిక్షపడాల్సిందే - కొడుకు ఇంక తనింటికి రాడు అని కుమిలిపోయాడు వెంకట్రామయ్య.

'నాయనమ్మా! నాకెప్పుడు పెళ్ళిచేస్తావు' అని ఉత్తరం రాస్తూంటాడు చంద్రం ఒక బిడ్డ తండ్రయి కూడా.

పాపం... నాంచారమ్మ మాత్రం మనవడికి పెళ్ళి సంబంధాలు చూస్తూనే ఉంది... ●

### రచైత

రచయిత ప్రసాద్‌బాబుకు తానో గొప్ప విమర్శకుడనని, కథకుడనీ మాచెడ్డ నమ్మకం. ఎవరెలాంటి కథ రాసి చూపినా, 'హాఫ్! ఇందులో శిల్పం లేదు, గిల్పం లేదు, రసంలేదు, ఏం బావోలేదు' అంటూ తిప్పికొట్టేసేవాడు. దీనితో విసిగిపోయిన మిత్రుడొకడు తానో కథ రాశాననీ, అభిప్రాయం చెప్పమనీ అడిగేడు.

ఆ కాగితాలను తిరగేసి, "ఈ కథలో రసం తగ్గిందోయ్!, మరీ పాత చింతకాయ పచ్చడి, ప్చ్ బావోలేదు" అంటూ మొదలెట్టేడు ప్రసాద్ బాబు.

వెంటనే ఆ మిత్రుడు 'ఆ కథ నిన్న చదవమని నాకిచ్చావ్! అది నీవు రాసిందే!' అన్నాడు తాపీగా.